క్లుప్తంగా

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతి



వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలోని మాజీ సర్పంచ్‌ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వారు మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లుల మంజూరు కోసం అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు.

శంకర్‌యాదవ్‌కు నివాళులు



నివాళులర్పిస్తున్న అరుణ్‌కుమార్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఇటీవల చనిపోయిన సికింద్రాబాద్ మోండా మార్కెట్ వ్యాపార సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ చిత్రపటానికి గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



రవికాంతారావు

తొగుట(దుబ్బాక): స్థానిక ఎస్‌ఐగా రవి కాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన లింగం డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా సిద్దిపేట కమిషనర్ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న రవికాంతారావు తొగుట ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా కలవాలని సూచించారు.

బెజ్జంకి 'లయన్స్'కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న సుదర్శన్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): పలు రంగాలలో ఉత్తమ సేవలందించినందుకు గాను బెజ్జంకి లయన్స్ క్లబ్‌తోపాటు పలువురు సభ్యులకు కరీంనగర్‌లో ఆదివారం అవార్డులను ప్రదానం చేసినట్లు క్లబ్ ప్రతినిధి మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, వైద్య సేవలు తదితర రంగాలలో ఉత్తమ అవార్డులురాగా సేవలందించిన ప్రభాకర్, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, విశ్వప్రసాద్‌కు అవార్డులు అందజేశారని తెలిపారు.

పాఠశాలలో టీఎల్‌ఎం మేళా



అవగాహన కలిగిస్తున్న టీచర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం టీఎల్‌ఎం మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వి.కిషన్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా 30వ తేదీ వరకు ఈ మేళా నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయడానికి ఈ మేళా దోహదం చేస్తుందన్నారు. టీచర్లు శ్రీనివాస్, రాజేశ్వరి, బాలకృష్ణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతి సేనకు ఆర్మీ ఉద్యోగి

మర్కూక్(గజ్వేల్): ప్రపంచంలోని పేద దేశాలలో శాంతి స్థాపన కోసం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేసే శాంతిసేనకు మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన ఆర్మీ ఉద్యోగి బొక్కి వెంకటేశ్ ఎంపికయ్యారు. సెలవుపై ఇంటికి వచ్చిన తనకు సోమవారం శాంతిసేనకు ఎంపికైనట్లు ఉన్నతాధికారులు ఫోన్‌ద్వారా తెలిపారని ఆయన చెప్పారు. బీజేపీ ఎక్స్ ఆర్మీ సెల్ కన్వీనర్ నీలం చంద్రం ఆయను సన్మానించారు. కార్యక్రమంలో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షఫీ పాల్గొన్నారు.

గుబ్బడి గుట్టను మింగేశారు

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- పనులను అడ్డుకున్నా ఆగలేదు..
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు

ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. గుట్టలు, ప్రభుత్వ, పోరంబోకు, అసైన్డ్, వాగు భూములను దర్జాగా ఆక్రమించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనక పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఇటీవల హుస్నాబాద్‌లోని సమీకృత కార్యాలయంలో స్థానిక రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇప్పుడైనా కబ్జా భూములకు మోక్షం కలుగుతుందేమో చూడాలి.

– అక్కన్నపేట(హుస్నాబాద్)



అక్రమార్కులు కబ్జాచేసి సాగుచేసిన గుబ్బడి గుట్ట

అక్కన్నపేట మండలంలోని గుబ్బడి గుట్ట దాదాపు 40ఎకరాల్లో ఉంటుంది. పెద్దపెద్ద బండ రాళ్లతో దట్టమైన అడవిని తలపిస్తుంది. కానీ గత సెప్టెంబరులో పలువురు పెద్దపెద్ద జేసీబీల సహాయంతో రాత్రికి రాత్రే గుట్టను చదును చేశారు. బండరాళ్లు, భారీ వృక్షాలను నేలమట్టం చేశారు. అది గమనించిన చుట్టు పక్కల రైతులు రెవెన్యూ అధికారులకు, 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో అధికారులు వచ్చి పనులను అడ్డుకొని కబ్జాదారులను మందలించి వదిలివేశారు. కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు మళ్లీ చదనుచేసి ఏకంగా పత్తి పంటను సాగుచేశారు.



గౌరవెల్లి ప్రాజెక్టుకు ఆనుకొని..

గుబ్బడి గుట్ట గౌరవెల్లి ప్రాజెక్టుకు ఆనుకొని ఉంది. ఇక్కడ ఎకరం స్థలం సుమారుగా రూ.45లక్షలకుపైగా పలుకుతోంది. ఈ గుట్ట ఒకవైపు బంజారాహిల్స్ అనే పేరుతో భూనిర్వాసితులు ఇళ్లను నిర్మించుకున్నారు. మరోపక్క గుట్ట కింది భాగం కుందనవానిపల్లి వైపు దాదాపు రెండు ఎకరాలకు పైగా కబ్జాచేసి పంటలను సాగు చేస్తున్నారు. చీకటి పడిందంటే చాలు అక్రమార్కులు గుట్టను కొద్దికొద్దిగా తోడేస్తూ చదును చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి గుట్ట కబ్జాకు గురికాకుండా కాపాడాలని చుట్టు పక్కల రైతులు కోరుతున్నారు.

స్వాధీనం చేసుకుంటాం



ప్రభుత్వ భూమిని చదనుచేసి సాగుచేస్తే విచారణ జరిపి వెంటనే స్వాధీనం చేసుకుంటాం. గుట్టలు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా కాపాడుతాం. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట మండలం

ప్రజల్లో చైతన్యం తెచ్చిన కవి దాశరథి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ గొంతెత్తి పాడి తెలంగాణ ప్రజలలో చైతన్యం తెచ్చిన కవి దాశరథి కృష్ణమాచార్యులు అని జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి అన్నారు. జయంతి సందర్భంగా సోమవారం దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి బాలసాహిత్య రచయితలు ఉండ్రాళ్ళ రాజేశం, బస్వరాజ్ కుమార్‌లతో కలిసి మాట్లాడారు. వివిధ సాహితీ ప్రక్రియల రచనలతో పాటుగా సినిమా పాటలు కూడా రచించి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కవి దాశరథి అని కొనియాడారు.

సంతకాల సేకరణ

సిద్దిపేట ఎడ్యుకేషన్: దాశరథి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 100మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితోపాటు విద్యార్థులతో దాశరథిపై అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తూ సంతకాలను సేకరించారు. దాశరథి గొప్పకవి అని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, తెలుగు విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



నరేందర్‌రెడ్డితో నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు నరేందర్‌రెడ్డిని చేర్యాల కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కలిశారు. నియోజకరవ్గంలోని పలు సమస్యల వివరించి అభివృద్ధికి సహకరించాలని వినతి పత్రం ఇచ్చారు. చేర్యాలను తిరిగి నియోజకవర్గ కేంద్రంగా చేసేలా చూడాలని కోరారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలరాజు, శివయ్య, కౌన్సిలర్ సురేశ్ ఉన్నారు.

ఉద్యాన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

వర్గల్(గజ్వేల్): పండ్ల తోటలు సాగుచేసే సన్న, చిన్నకారు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య అన్నారు. మండలంలోని శేరిపల్లిలో బోయిని నాగేశ్ సాగుచేసిన సీతాఫల పండ్ల తోటను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యాన పండ్ల తోటల సాగు రైతులకు ఎంతో లాభదాయకం అన్నారు. సీతాఫలం, నిమ్మ, మామిడి, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్‌పామ్ తదితర పండ్లతోటలు సాగుచేసే ఐదెకరాలలోపు విస్తీర్ణం కలిగిన రైతులకు ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేస్తుందని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ దేవేందర్ తదితరులు ఉన్నారు.

రైతుల కోసం గ్రీవెన్స్ సెల్



రైతుతో మాట్లాడుతున్న మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు రుణమాఫీ కాని రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి అన్ని రైతువేదిక భవానాల్లోను గ్రీవెన్స్ సెల్స్ ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి మల్లేశం తెలిపారు. మిరుదొడ్డిలోని రైతు వేదిక భవన్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో పలువురు రైతుల సందేహాలను సోమవారం ఆయన నివృత్తి చేశారు. లక్షలోపు రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్స్ సెల్‌లో ఆధార్ కార్డులతో సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు మండల పరిధిలో 3527మందికి డబ్బులు జమ చేశామని చెప్పారు. ఏఈఓలు ఆరేటి లోహిత్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకుఅవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో సోమవారం బాలికా అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఈ–మెయిల్స్, ఇతర యాప్‌ల ద్వారా వచ్చిన లింకులతో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఆ ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అనవసర లింక్‌లను క్లిక్ చేయడం వల్ల ఎన్నో అనర్థాలకు దారితీస్తుందని చెప్పారు. సైబర్ మోసాల బారిన పడిన వాళ్లు వెంటనే 1930కి కాల్‌చేసి వివరాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సరిత, కానిస్టేబుల్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

సిద్దిపేటరూరల్: ఓ ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఇర్కోడ్ శివారులో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన పుట్ట బాలమల్లు తన భార్య మానస, గాజులపల్లికి చెందిన లావణ్య కూరగాయల వ్యాపారులు. ఈ క్రమంలో వారి వ్యాపారం ముగించుకుని సాయంత్రం ఆటోలో తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. స్థానికులు గమనించి ఫోన్‌చేయగా అంబులెన్స్ సిబ్బంది వారిని హాస్పిటల్‌కు తరలించారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి ప్రాధాన్యం

కలెక్టర్ మనుచౌదరి





మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి.. హాజరైన ట్రాన్స్ జెండర్లు

సిద్దిపేటరూరల్: ట్రాన్స్ జెండర్ల జీవనోపాధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ట్రాన్స్ జెండర్లకు స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ స్విచ్ ఎకో సంస్థ ప్రతినిధి అక్షయ్ నైపుణ్య వారికి శిక్షణనిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 100మందికి పైగా ట్రాన్స్ జెండర్లు ఉన్నారని, వారికి ఇష్టమైన ఉపాధి యూనిట్‌ను అందజేస్తామని చెప్పారు. డీఆర్డీఏ ద్వారా కూడా పాడిఆవుల పెంపకం, పౌల్ట్రీ పామ్, క్యాంటీన్ నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, బ్యూటీ పార్లర్, మిల్క్ పార్లర్ లాంటి యూనిట్ల ద్వారా అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చేయించుకోవాలి



కోహెడరూరల్(హుస్నాబాద్): దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ శివకుమార్

దుబ్బాకటౌన్/బెజ్జంకి(సిద్దిపేట)/మర్కూక్(గజ్వేల్)/కోహెడరూరల్(హుస్నాబాద్): అర్హులైన రైతులు రైతుబీమా చేయించుకోవాలని ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు. బీమా పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దుబ్బాక మండల వ్యవసాయశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని 18–59 యేళ్ల వయస్సు గల రైతులు ఎవరైనా ఉంటే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారికి తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఆగష్టు 5వరకు అవకాశం ఉందని, ఈ నెల 28 వరకు పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్‌లతో నమోదు చేసుకోవచ్చని బెజ్జంకి ఏఓ సంతోష్ తెలిపారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో కాని ఏఈఓలను కాని సంప్రదించాలని సూచించారు. మర్కూక్, దామరకుంట, ఎర్రవల్లి రైతు వేదికలలో రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. మర్కూక్ రైతు వేదికలో రైతుల నుంచి నమోదు పత్రాలను తీసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజినీకాంత్, విష్ణువర్ధన్, అశ్విని పాల్గొన్నారు. కోహెడరూరల్ పరిధిలోని వరికోలు రైతువేదికలో ఏఈఓ రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుబీమా కోసం పట్టాపాసుబుక్కు కలిగిన రైతులంతా దరఖాస్తులు చేసుకోవాలని మిరుదొడ్డి మండల వ్యవసాయ అధికారి మల్లేశం కోరారు. 28వరకు మండల పరిధిలో మొత్తం 3927 మంది పట్టాదారు పుస్తకాలు పొందారని, దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతామని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లు ఏమయ్యాయి?

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నేత



దుబ్బాక: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

దుబ్బాక: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు కులగణనచేసి బీసీ కమిషన్ ఆధారంగా స్థానిక సంస్థల్లో ఉన్న బీసీ రిజర్వేషన్లు 23శాతం నుంచి 42శాతానికి పెంచుతామన్న సీఎం రేవంత రెడ్డి హామీ ఏమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకోజి ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీనిచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా నిధుల విషయంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో సుదర్శన్‌చారి, భాస్కర్, అశోక్, శ్రీకాంత్, రాజు, నరేశ్, పరశురాములు తదితరులు ఉన్నారు.

కాలయాపన తగదు..

హుస్నాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గొల్ల కురుమలకు 100రోజుల్లోనే రెండో దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రూ.2లక్షలు ఇస్తామన్న హామీ నేరవేర్చకుండా మోసం చేశారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాస్, బత్తుల శంకర్‌బాబు, సతీశ్, రాంప్రసాద్, అరుణ్, లక్ష్మయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు ఎక్కడ

కోహెడ(హుస్నాబాద్): బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు కక్కర్ల దామోదర్‌గౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీ దేవేంద్రకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు నోచుకోవడం లేదన్నారు. నర్సయ్యగౌడ్, శివకుమార్, సాగర్‌గౌడ్, సతీశ్, లక్ష్మణ్, రాజుచారి, పరశురాములు, తిరుపతి, మహేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటజోన్: గజ్వేల్ రూరల్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఐవోసీలో తహసీల్దార్ శ్రవణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, రాజు, రమేశ్, మధు, నరేశ్, సురేశ్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట జోన్‌లో అర్బన్ తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు శంకర్, యాదస్ రావు, వేణుగోపాల్, శ్రీనివాస్, శివకుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వండి

సీఐటీయూ రాష్ట్ర నేత గోపాలస్వామి



వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

సిద్దిపేటరూరల్: ఆశావర్కర్లకు నష్టం కలిగించే విధంగా ఉన్న పరీక్షా విధానాన్ని రద్దుచేసి వారికి రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని అందించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు చెందిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బర్ల భాస్కర్, రవికుమార్, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి, మంజుల, బాలమణి, నీరజ, లావణ్య, రజిత, శారద, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఢిల్లీలో జిల్లా నేతల సంబరాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రైతులకు రుణమాఫీ చేస్తున్నందుకు గాను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో జిల్లా నేతలు సంబరాలు నిర్వహించినట్లు పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. దేశంలోనే రూ.2లక్షల రుణమాఫీ చారిత్రాత్మకమని అది కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గయాజొద్దీన్ పాల్గొన్నట్లు తెలిపారు.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మద్దూరు(హుస్నాబాద్): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రజిత సూచించారు. మండల పరిధిలోని గ్రామాలలో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిలవలు లేకుండా చూసుకోవాలన్నారు.

◆ యువత కోసమే ఓపెన్ జిమ్‌లు

హుస్నాబాద్‌రూరల్: మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో యువత ఆరోగ్యం కోసం గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పీసీసీ కార్య దర్శి కేడం లింగమూర్తి చెప్పారు. సోమవారం తోటపల్లి, వంగరామయ్య, పొట్లపల్లి, మాలపల్లి గ్రామాల్లో జిమ్‌ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఈ జిమ్‌లు ఉపయోగపడుతాయన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఓపెన్ జిమ్‌ల నిర్మాణాల కోసం రూ.5లక్షల చొప్పున నిధులను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కర్ర రవీందర్‌రెడ్డి, వెన్న రాజు, బందెల హరీశ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మెరుగైన సేవలందించాలి

సిద్దిపేటకమాన్: సైబర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు సైబర్ వారియర్స్ కృషి చేయాలని ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. జిల్లాలోని సైబర్ వారియర్ సిబ్బందికి సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ట్రేడింగ్ సైబర్ నేరాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం అభినందనీయమని, రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తిగుల్ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ పదేళ్లుగా రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో ఉమ్మడి కుటుంబాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, భిక్షపతి, మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రమాదాల నియంత్రణకు చొరవ చూపాలి

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీసుల మాదిరిగా రోడ్డు భద్రత కమిటీ సభ్యులు చొరవ చూపాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ కోరారు. రాజీవ్ రహదారిస్టేట్ హైవే నెంబరు1 పరిధిలోని విలేజ్ రోడ్డు భద్రత కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీ సభ్యులు క్షతగాత్రులను ఆసుపత్రికి పంపించేందుకు ప్రయత్నించాలని, ట్రాఫిక్ జాం ఏర్పడినప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ పూర్వ విద్యార్థికి సన్మానం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఫిజికల్ డైరెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థి చిన్నగల్ల నాంపల్లిని సోమవారం లెక్చరర్లు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థి నాంపల్లి ఫిజికల్ డైరెక్టర్ నియామక పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి మల్టీజోన్–1లో మొదటి ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం

చేర్యాల(సిద్దిపేట): నూతనంగా ఎన్నికైన పట్టణ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, నవీన్‌కుమార్, తడక లింగమూర్తి, మాడిశెట్టి హేమలత, రావికంటి చంద్రశేఖర్, జిల్లా వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కోహెడ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా క్యాబినెట్ సభ్యుడు డాక్టర్ కె.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రథమ బహుమతికి హారిణి, ద్వితీయ బహుమతికి తాజ్మీన్, తృతీయ బహుమతికి అభిరామ్ ఎంపికయ్యారన్నారు.